సాక్షి సూర్యాపేట

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



కమ్యూనిస్టులకు ప్రజల అండ

సమస్యలపై పోరాటం చేసే కమ్యూనిస్టులకు ప్రజలు అండగా ఉంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు అన్నారు. - 8లో



అనేక సవాళ్లకు..

అనేక సవాళ్లకు సైన్స్‌తోనే పరిష్కారం లభిస్తుందని సీసీఎంబీ ప్రిన్సిపల్ సైంటిస్టు, ఎంజీయూ వీసీ అన్నారు. - 10లో



కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు

మిషన్ భగీరథ పేరిట గత ప్రభుత్వం నిధులను కాంట్రాక్టర్లకు దోచిపెట్టిందని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. - 10లో

న్యూస్‌రీల్

జిల్లా అదనపు కలెక్టర్ బదిలీ

- నూతన అదనపు కలెక్టర్‌గా లత

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఏ. వెంకట్‌రెడ్డి హన్మకొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాల అదనపు కలెక్టర్ బి.లతను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హుజూర్‌నగర్ ఆర్డీఓ బదిలీ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి మెదక్ జిల్లా నర్సాపూర్ ఆర్డీఓగా బదిలీ అయ్యారు. ఈమేరకు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాస్‌ను హుజూర్ నగర్‌కు బదిలీ చేశారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్

మునగాల: గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ కోరారు. మునగాల మండలం వెంకట్రాంపురం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామపంచాయతీ కార్యాలయం, నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో నర్సరీలను కాపాడాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి భూపాల్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సురభి జ్యోతి, అంగన్‌వాడీ కేంద్రం టీచర్ అలివేలు ఉన్నారు.

హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా సంపత్‌రెడ్డి



కోతి సంపత్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కోతి సంపత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ ఎన్నికకు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఎక్స్ అఫీషియో సభ్యులు, మంత్రి ఉత్తమ్‌తో పాటు మొత్తం 29 మంది సభ్యులకు 24 మంది హాజరయ్యారు. వైస్ చైర్మన్‌గా 3వ వార్డు కౌన్సిలర్ సంపత్‌రెడ్డిని 12వ వార్డు కౌన్సిలర్ వెలిదండ సరిత వీరారెడ్డి ప్రతిపాదించగా 22 వార్డు కౌన్సిలర్ అమరబోయిన సతీష్ బలపరిచారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో వైస్ చైర్మన్‌గా సంపత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీఓ ప్రకటించారు. అనంతరం నియామక పత్రం అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డీఏఓ నారాయణ పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకంపై ప్రజలకు అవగాహన పెంచాలి

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : విశ్వకర్మ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ పథకంపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మొత్తం 5,190 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి. సీతారాం, ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకులు (హైదరాబాద్) శ్రీనివాసరావు, డీపీఎం సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఏజెన్సీపై కేసు నమోదు చేయాలి

సాక్షి ఎఫెక్ట్..

మోసపూరితంగా నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన మణికంఠ ఏజెన్సీపై కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు.. ఎస్పీకి ఒక ప్రకటనలో సూచించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో టోకరా అనే శీర్షికన బుధవారం సాక్షిలో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించారు. కలెక్టరేట్‌లో శానిటేషన్ కోసం కమిటీ ఆధ్వర్యంలో టెండర్ నిర్వహించి మణికంఠ ఏజెన్సీ ద్వారా 2023 సెప్టెంబర్‌లో ముగ్గురు స్వావెంజర్లను తీసుకున్నట్లు పేర్కొన్నారు. మణికంఠ ఏజెన్సీ ఇతరుల వద్ద నుంచి వసూలు చేసిన డబ్బులకు కలెక్టరేట్‌కు సంబంధం లేదని, బద్నాం చేసే ఏజెన్సీలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కమిటీ ద్వారా అవుట్ సోర్సింగ్ పద్ధతిపై నియమించిన వివరాలను ఎస్పీ కి పంపించినట్లు తెలిపారు.

రూ. 50 కోట్ల స్థలానికి ఎసరు!

- కార్యాలయం, క్వార్టర్ల కోసం 1970లో సేకరించిన బీఎస్ఎన్ఎల్
- ఇందులో ఎన్నెస్పీ స్థలం ఉందని కొందరు కోర్టుకు..
- ఎలాగైనా కాజేయాలని ప్లాన్
- తప్పుడు సర్వేలతో అధికారుల సపోర్టు
- నేడు విచారణ చేయనున్న అధికారులు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

కోదాడ: రూ.50కోట్ల విలువైన బీఎస్ఎన్ఎల్ స్థలాన్ని కాజేసేందుకు కొందరు యత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ కార్యాలయ స్థలంలో తమ భూమి ఉందని కోర్టుకు సైతం వెళ్లినట్లు సమాచారం. దీనికి అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై నేడు అధికారులు విచారణ చేయనున్నట్లు సమాచారం.ఈ స్థలాన్ని కాపాడాలని ఇటీవల కోదాడకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కొందరు వినతిపత్రం ఇచ్చారు.

అసలు విషయం ఏమిటంటే..

కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన సర్వే నంబర్ 149లో నాగుబండి పద్మయ్యకు 8 ఎకరాల 68 సెంట్ల భూమి ఉంది. దీని నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో తమ అవసరాల కోసం ప్రభుత్వం 3 ఎకరాల 6 గుంటలు సేకరించింది. ఆ తర్వాత పద్మయ్య కోదాడ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి 1963లో రెండు ఎకరాలు దానం ఇచ్చారు.1975లో వచ్చిన సీలింగ్ యాక్ట్ సమయంలో సర్వే నంబర్ 149లో తమకు ఎలాంటి భూమి లేదని, ఉన్న మొత్తం భూమిని తాము అమ్ముకున్నామని భూమి యజమాని నాగుబండి పద్మయ్య డిక్లరేషన్ ఇచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఆయన ఇద్దరు వారసులకు ఇందులో భూములు ఉన్నట్లు 1986లో పట్టాదారు పుస్తకాలు కూడా జారీ చేసినట్లు సమాచారం. వీరిలో ఒకరు కోర్టులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ వైద్యశాలలో తాము దానం ఇచ్చిన దానికన్నా ఎక్కువ స్థలం ఉందని 560 గజాల స్థలాన్ని పొందినట్లు తెలిసింది. వాస్తవానికి వైద్యశాల ఆవరణలో దానం ఇచ్చిన రెండు ఎకరాలకు అర ఎకరం తక్కువ ఉండడం గమనార్హం.

ఎన్నెస్పీ స్థలంలో 15 గుంటలు

నాగుబండి వీరయ్య వారసులు కోదాడ ఎన్నెస్పీ స్థలంలో తమ భూమి ఉందని 1997లో కోర్టులో కేసు వేశారు. దీనిపై సర్వే చేయాలని అధికారులను కోర్టు ఆదేశించడంతో ఎన్నెస్పీ లో 15 గుంటలు, సర్వే నంబర్ 150లో ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఎకరం ఒక గుంట భూమి ఉందని రిపోర్టు ఇచ్చినట్లు సమాచారం. 2016లో ఎన్నెస్పీ లో ఉన్న 15 గుంటల స్థలాన్ని అధికారులు ఆయన వారసులకు అప్పగించినట్లు తెలిసింది. ఈ భూమిని గతంలో తనకు భూమి లేదని భూ యజమాని డిక్లరేషన్ ఇచ్చిన తరువాత జారీ చేసిన తప్పుడు పాస్ పుస్తకం ఆధారంగా ఇతరులకు అమ్ముకున్నట్లు తెలిసింది.

తప్పుడు నివేదిక అని తేల్చిన రాష్ట్ర అధికారులు

సర్వే నంబర్ 149లో జిల్లా అధికారి చేసిన సర్వేపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చింది. రాష్ట్ర సర్వే అండ్ ల్యాండ్ కమిషనర్ ఆధ్వర్యంలో 11 మంది అధికారుల బృందం సర్వే నంబర్ 149ని పూర్తిగా సర్వే చేసి అందులో ఎలాంటి మిగులు భూమి లేదని తేల్చడంతో పాటు గతంలో మిగులు భూమి ఉందని రిపోర్టు ఇచ్చిన సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కానీ రెవెన్యూ అధికారులు ఈ రిపోర్టును వెలుగులోకి రాకుండా తొక్కిపెట్టినట్లు సమాచారం. గతంలో జిల్లా సర్వే అధికారి ఇచ్చిన రిపోర్టు ఆధారంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉన్న తమ భూమిని అప్పగించాలని ఆయన వారసులు కోర్టులో కేసు వేశారు. ఎక్కువ స్థలం ఉంటే కొలవాలని కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నారు. గతంలో భూమి లేదని రాష్ట్ర అధికారులు ఇచ్చిన రిపోర్టును కోర్టు ముందు ఉంచాల్సింది. కానీ బీఎస్ఎన్ఎల్‌లో ఎకరం అధికంగా ఉందని ఈ నెల 24వ తేదీన వారు రిపోర్టు కూడా ఇచ్చారు. దీనిపై ఈనెల 29వ తేదీన విచారణ జరగనుంది.

జిల్లా సర్వేయర్ రిపోర్టు ఇచ్చాడు

ఎన్ఎస్పీ స్థలం బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో ఉందని కొందరు కోర్టుకు వెళ్లడంతో ఇటీవల సర్వే చేశారు. సర్వే వద్దకు నేను కూడా వెళ్లాను. కానీ రిపోర్టు జిల్లా సర్వేయర్ సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని ఉండడంతో ఆయనే 23న కోర్టుకు ఇచ్చారు. దానిలో ఏముందో నాకు తెలియదు. రిపోర్టు వచ్చిన తరువాత పరిశీలిస్తాను.

– సూర్యనారాయణ, ఆర్డీఓ

బీఎస్ఎన్ఎల్ భూమి ఏమైంది?

కోదాడ బీఎస్ఎన్ఎల్ అధికారులు 1970లో భూసేకరణ ద్వారా సర్వే నంబర్ 150లో రెండు ఎకరాల ఆరు గుంటల స్థలాన్ని సేకరించి భవనాలు, ఉద్యోగుల క్వార్టర్లు నిర్మాణం చేసుకున్నారు. ఈ కార్యాలయం చుట్టూ ప్రహరీ ఉంది. లోపల రెండు ఎకరాల భూమి మాత్రమే ఉంది. మరి సర్వే నంబర్ 149కి సంబంధించిన భూమి బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉంటే మరి బీఎస్ఎన్ఎల్ భూమి ఎక్కడికి పోయిందన్నది అంతుచిక్కనిప్రశ్నగా మారింది. 149 సర్వే నంబర్ భూమి తమ కార్యాలయంలో ఉంటే తమ భూమి ఎక్కడ ఉందో చెప్పాలని బీఎస్ఎన్ఎల్ అధికారులు కోరుతున్నారు.

నాలుగేళ్లకో పండుగ



నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీపు సంవత్సరం ఎంతో ప్రత్యేకం. లీపు సంవత్సరంలో ఫిబ్రవరి 29న జన్మించిన వారు, అదే రోజున పెళ్లి చేసుకున్న వారికి బర్త్ డే, మ్యారేజ్ డే ఎంతో స్పెషల్. సాధారణంగా అంతా ప్రతి ఏటా వేడుకలు జరుపుకుంటే.. వీరు మాత్రం నాలుగేళ్లకోసారి వచ్చే ఈ రోజును ఎంతో ప్రాధాన్యమిచ్చి సంబరాలు జరుపుకుంటారు. మరి కొందరు ఈ రోజున పలు శుభకార్యాలు నిర్వహించేందుకు ప్లాన్ చేసుకుంటారు.

లీపు సంవత్సర ప్రత్యేక కథనాలు 8లో..

తొలిరోజు 8,962 మంది హాజరు



సూర్యాపేట పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

- ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం

సూర్యాపేటటౌన్ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 8.30గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. నిమిషం నిబంధన ఉండటంతో విద్యార్థులంతా ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. జిల్లాలో మొత్తం 9,686 మంది విద్యార్థులకు 8,962 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 724 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 7,857 మందికి 7,423 మంది హాజరు కాగా 434 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ విభాగంలో 1,829 మందికి 1539 మంది విద్యార్థులు హాజరు కాగా 290 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈఓ జానపాటి కృష్ణయ్య తెలిపారు. ఆయన జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.



జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఐఈఓ కృష్ణయ్య

కొత్తగా వ్యవసాయ డిగ్రీ కళాశాల

- కంపాసాగర్‌లో ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం



కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

త్రిపురారం: నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండలం కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధికారులను ఆదేశించారు. కంపాసాగర్‌లో 2007 నుంచి వ్యవసాయ పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల కొనసాగుతుండగా ఇప్పుడు వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటు కానుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిలోనే ఏర్పాటు చేసే అవకాశం

కంపాసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 125, 126లో సుమారు 305 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో గతంలోనే 25 ఎకరాల భూమిని లెదర్ డెవలప్‌మెంట్ ఇండ్రస్ట్రీయల్ కార్పొరేషన్‌కు కేటాయించారు. మరో 15 ఎకరాలకుపైగా బాబుసాయిపేట, కంపాసాగర్, త్రిపురారం గ్రామాలకు శ్మశాన వాటికలకు, మరికొంత 6.30 ఎకరాల భూమిని త్రిపురారం డంపింగ్ యార్డ్‌కు, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం నిర్మాణానికి, తెలంగాణ మోడల్ స్కూల్‌కు కేటాయించారు. ఈ ప్రభుత్వ భూమిలోనే 2005లో 281 ఎకరాల్లో వ్యవసాయ పరిశోధన స్థానం ఏర్పాటైంది. ఇందులోనే సుమారు 50 ఎకరాల భూమిని 2011లో కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌కు కేటాయించారు. ప్రస్తుతం సుమారు 230 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండడంతో ఇందులో వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ లింగయ్య ఆధ్వర్యంలో నూతన వరి వంగడాల ఉత్పత్తి, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం, రైతులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అయితే వ్యవసాయ డిగ్రీ కళాశాలకు ఐసీఆర్ నామ్ ప్రకారం సుమారు 50 ఎకరాల భూమి అవసరం ఉండడం.. ఇక్కడ ప్రభుత్వ భూమి ఉండడంతో ఇక్కడే వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇక్కడే డిగ్రీ కళాశాల ఎందుకంటే..

2005వ సంవత్సరంలో కంపాసాగర్‌లో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రారంభించి శాస్త్రవేత్తలు నూతన వరి వంగడాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇక్కడ తయారైన కొత్త వంగడాలను ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మార్కెటింగ్ చేస్తున్నారు. వ్యవసాయ పరిశోధన స్థానంతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం కూడా ఇక్కడే ఉంది. దీంతో కంపాసాగర్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు పంటల సాగులో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. నూతన వంగడాల అభివృద్ధి జరగడంతో పాటు కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగే శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు అందుబాటులో ఉండడం వల్ల తరగతి గది పాఠాలతో పాటు క్షేత్ర స్థాయిలో అభ్యసన కార్యక్రమాలను చేపట్టవచ్చనే ఉద్దేశంతో గతంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే గతంలో కూడా ఇక్కడ వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. కానీ, కార్యరూపం దాల్చలేదు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఇక్కడే వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

సీఆర్‌పీల పాత్ర కీలకం

సూర్యాపేటటౌన్ : విద్యాశాఖ కార్యక్రమాల అమలులో సీఆర్‌పీల పాత్ర కీలకమని డీఈఓ కె.అశోక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. బడిబాటలో పిల్లలను బడిలో చేర్పించడం, పాఠశాలల పర్యవేక్షణ, పుస్తకాలు, యూనిఫాం పంపిణీ, కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు సహకరించడం ఇలా ఎన్నో పనులు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ శైలజ, సెక్టోరియల్ అధికారులు, సీఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంపటి శ్రీనివాస్, లింగయ్య, మహేందర్, సైదయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, వహీద్, సావిత్రి, సోమేష్, నరేష్, నాగు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చివ్వెంల(సూర్యాపేట) : రాజీ మార్గమే రాజమార్గం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులతో కలిసి నిర్వహించిన లోక్‌అదాలత్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ కుదిరే అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. ప్రజలకు దీనిపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ దశలో ఉన్న రాజీ పడే కేసులపై దృష్టి సారించాలన్నారు. క్రిమినల్, సివిల్, వెహికిల్ యాక్ట్, విద్యుత్, బ్యాంకులు, ఎక్సైజ్, గృహ హింస వంటి కేసుల్లో రాజీ పడవచ్చని సూచించారు. పోలీసులు, జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కేసుల పరిష్కారంలో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, ఎస్పీ రాహుల్ హెగ్డే, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కోదాడ ఎంపీపీగా మల్లెల రాణి

కోదాడరూరల్ : కోదాడ ఎంపీపీగా మల్లెల రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదివరకు ఎంపీపీగా ఉన్న చింత కవితరాధారెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీగా ఉన్న రెడ్లకుంట ఎంపీటీసీ మల్లెల రాణి ఇన్‌చార్జ్ ఎంపీపీగా కొనసాగుతున్నారు. అధికారులు నూతన ఎంపీపీని ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీఓ సూర్యానారాయణ సమావేశం ఏర్పాటు చేసి ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 11 మంది ఎంపీటీసీలకు ఇద్దరు మృతి చెందగా మిగిలిన తొమ్మిది మందిలో గణపవరం, తొగర్రాయి, కాపుగల్లు–2, రెడ్లకుంట, నల్లబండగూడెం, చిమిర్యాల ఎంపీటీసీలు హాజరయ్యారు. అధికారులు ఎంపీపీ పదవికి నామినేషన్‌లు కోరగా ఎంపీటీసీ రాణిబ్రహ్మయ్య ఒక్కరే దాఖలు చేశారు. దీంతో ఆమె ఎన్నికైనట్లు ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. రాణి మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచందర్‌రావు, జెడ్పీటీసీ మండలపు కృష్ణకుమారిశేషు, ఎంపీటీసీలు హిమబిందు, గుర్వమ్మ, శ్రీలత, క్రాంతికుమార్, సౌజన్య, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, సాధినేని అప్పారావు, వెంకటేశ్వరరావు, సీతరాంరెడ్డి, సుమన్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



ఎంపీపీ రాణికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు, సిబ్బంది

పొట్టకూటికి వెళ్తూ..



రెండేళ్ల క్రితం భర్త, నేడు భార్య.. జీవనయానంలో దంపతులిద్దరు.. కూలి పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తున్న మరొకరు.. కుటుంబానికి ఆసరాగా ఉన్న మాతృమూర్తి.. ఇలా మోతె శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ. మిర్చితోటల్లో కాయలు ఏరేందుకు కూలీలు వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఈ ప్రమాదం ఐదుగురిని బలితీసుకోగా పలువురిని క్షతగాత్రులను చేసింది. - 8లో

ఈకేవైసీ 75శాతమే..

- నేటితో ముగియనున్న గడువు
- నమోదు చేయించుకోవాల్సిన వారు 2,40,725 మంది
- ఆధార్ అప్‌డేట్‌లేక, వేలిముద్రలు పడక జాప్యం



ఫణిగిరిలో ఈకేవైసీ నమోదు చేస్తున్న రేషన్ డీలర్

నాగారం : అర్హులకే రేషన్ సరకులు అందేలా ప్రభుత్వం లబ్ధిదారుల ఈ-కేవైసీ నమోదు చేస్తోంది. రేషన్ కార్డుదారుల ఆధార్ అనుసంధానం చేసే ఈ-కేవైసీ గడువు గురువారంతో ముగియనుంది. ప్రభుత్వం ఇప్పటికే రెండు సార్లు గడువు పెంచినా ఇంకా జిల్లాలో 25శాతం మంది ఈ-కేవైసీ నమోదు చేసుకోలేదు. ఆహార భద్రత కార్డుదారుల లెక్క పక్కాగా తేల్చేలా కేంద్రం దృష్టి సారించింది. కార్డులు పొందిన వారిలో కొందరు మృతి చెందడం ,కొందరు వివాహమై వెళ్లి పోయినా.. కార్డులో పేరు కొనసాగడం, వలస వెళ్లడం, కొందరు ప్రభుత్వ కొలువులు సాధించినా కార్డులు అప్పగించకపోవడం వంటి వాటికి చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వం ఈ-కేవైసీ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ప్రతి లబ్ధిదారుడు విధిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్న ఆదేశంతో రేషన్ డీలర్లు ఉచితంగా ఈకేవైసీ చేస్తున్నారు. ఈనెల29 లోపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో గడువు పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

రేషన్ దుకాణాలు	610
ఆహార భద్రత కార్డులు	3,24,194
లబ్ధిదారులు	9,31,827 మంది
ఈకేవైసీ చేయించుకున్నవారు	6,91,102 మంది


ఆధార్ అనుసంధానం చేయించుకోని 2,40,725 మంది

జిల్లాలో ఆహార భద్రత కార్డులు 3,24,194 ఉండగా ఇందులో 9,31,827 మంది లబ్ధిదారులుగా నమోదై ఉన్నాయి. వీరంతా విధిగా దుకాణానికి వెళ్లి ఈ-పాస్ యంత్రం ద్వారా ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. జిల్లాలో ఇప్పటి వరకు 6,91,102 మంది ఈ-కేవైసీ చేసుకున్నారు. అంటే 75 శాతం పూర్తయింది. ఇంకా 2,40,725 మంది చేయించుకోవాల్సి ఉంది. ప్రభుత్వం ఈనెల29వ తేదీ వరకు అనుసంధానం కోసం అవకాశం కల్పించింది. దీంతో వీరంతా గడువులోపు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆటంకాలు అనేకం..

రేషన్ సరుకుల్లో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం ఇప్పటికే ఈ-పాస్ విధానం ద్వారా బియ్యం పంపిణీకి చర్యలు చేపట్టింది. అలాగే నిరుపేదలకు అందించే రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు లబ్ధిదారుల కోసం ఈకేవైసీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి ఒక్కరూ విధిగా సంబంధిత డీలర్ వద్ద వేలిముద్ర నమోదు చేసుకోవాలని సూచిస్తుంది. కానీ చాలా మందికి ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో, చిన్నారుల వేలిముద్రలు రాకపోవడం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఉండటంతో వీరందరి ఈకేవైసీ నమోదు ఆలస్యమవుతోందని, అలాగే మరో వైపు చాలా మంది వృద్ధుల వేలిముద్రలు పడక నమోదు ప్రక్రియలో జాప్యం అవుతోందని అధికారులు చెబుతున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేసుకోవాలి



అర్హులైన ప్రతిఒక్కరూ విధిగా డీలర్ వద్దకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేసుకోవాలి. ఇప్పటికే జిల్లాలో ఈకేవైసీ నమోదు 75శాతానికిపైగా పూర్తయింది. ఈకేవైసీ నమోదు తక్కువగా ఉన్న దగ్గర ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేస్తాం.

– మోహన్‌బాబు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, సూర్యాపేట.

క్లుప్తంగా

సాఫ్ట్ బాల్ పోటీలో సహస్రకు బంగారు పతకం

నల్లగొండ: బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈ నెల 21నుంచి 25 వరకు జరిగిన 41వ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున సహస్ర పాల్గొని బంగారు పతకం సాధించిందని ఉమ్మడి జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం సహస్రను ఉమ్మడి జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముల్కా నాగిరెడ్డి, ట్రెజరర్ రేఖల వీరేశం, కోచ్ పృథ్వీరాజ్, లింగస్వామి, తరుణ్, చంద్రమోహన్‌లు తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పల్లపు స్వాతికి గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న స్వాతి

మద్దిరాల : మండల పరిధిలోని ముకుందాపురం గ్రామానికి చెందిన పల్లపు స్వాతికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గోల్డ్‌మెడల్ ప్రదానం చేసింది. స్వాతి ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ తెలుగు సాహిత్యం, ఎం.ఏ సమాజశాస్త్రం చదివారు. ఆమె ఆచార్య సి.మృణాళిని పర్యవేక్షణలో విమల రచనలు–సామాజిక ఆర్థిక విశ్లేషణ అంశంపై పరిశోధన చేశారు. ఈ నెల 23న నిర్వహించిన మౌఖిక పరీక్షకు ఆమె చూపిన ప్రతిభకు గాను గోల్డ్‌మెడల్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన 16వ స్నాతకోత్సవంలో గవర్నర్, విశ్వవిద్యాలయ చాన్స్‌లర్ డా.తమిళిసై సౌందర రాజన్ చేతుల మీదుగా స్వాతి గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు.ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ఆచార్య తంగెడ కిషన్‌రావు, ఆచార్య రమేష్ స్వాతిని అభినందించారు.

మూడు పేజీల ప్రశ్నపత్రానికి రెండు పేజీలే ఇచ్చిన ఇన్విజిలేటర్

- కొన్ని ప్రశ్నలకే జవాబులు రాసిన విద్యార్థిని

నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల సెంటర్‌లో ముగ్గురు ఉర్దూ మీడియం విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరుకాగా.. అందులో ఒక విద్యార్థినికి రెండు పేజీల ప్రశ్నపత్రం వచ్చింది. ప్రశ్నపత్రం మూడు పేజీలు ఉండాల్సి ఉండగా అందులో ఒక పేజీ లేకుండా రెండు పేజీల బుక్‌లెట్ వచ్చింది. ఆ విద్యార్థిని అంతవరకే జవాబులు రాసి వచ్చింది. ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో ఒక పేజీ తక్కువ ఉన్న విషయాన్ని ఇన్విజిలేటర్ గానీ, సదరు విద్యార్థిని గానీ చూసుకోలేదు. ఈ విషయమై డీఐఈవో దస్రూనాయక్‌ను వివరణ అడగ్గా.. తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

ఒక్కటవుతున్నారు



వరుణ్‌కుమార్-సుష్మ (కాబోయే దంపతులు)

రామన్నపేట : రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన పున్న శేషాద్రి-అనితల కూతురు సుష్మ వివాహం దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన శ్రీరాముల ఆంజనేయులు-సరస్వతి కుమారుడు వరుణ్‌కుమార్‌తో నిశ్చయం అయింది. ఈనెల 29న రామన్నపేట శ్రీలక్ష్మీ గార్డెన్స్‌లో వీరి వివాహం జరగనుంది. తేదీతో సంబంధం లేకుండా పేరు బలాలను చూసి ముహూర్తం పెళ్లి ఖరారు చేసినట్లు తల్లితండ్రులు తెలిపారు.

గొప్ప రోజుగా భావిస్తున్నాం



పెళ్లి చేసుకోనున్న కొత్త జంట

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన క్రాంతికుమార్, నిజామాబాద్‌కు చెందిన గాయత్రి వివాహం గురువారం ఉదయం 9 గంటలకు మోత్కూరులో జరగనుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన క్రాంతికుమార్, గాయత్రి ముంబైలో ఓ కంపెనీలో పని చేస్తుండగా పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. లవ్ కం అరేంజ్ మ్యారేజ్‌గా ఫిబ్రవరి 29న వీరి పెళ్లికి ముహూర్తం రావడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నారు. నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఫిబ్రవరి 29 గొప్ప రోజని.. ఆ రోజున మా పెళ్లి జరగడం ఓ మధురానుభూతిని తెస్తోందని అంటున్నారు క్రాంతికుమార్, గాయిత్రి.

పన్నెండేళ్లకు మూడో పుట్టినరోజు..



సయ్యద్ హర్ఫాన్‌అలీ

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని బంగారిగడ్డకు చెందిన సయ్యద్ షఫాయత్‌అలీ–నసీమా దంపతులకు కుమార్తెలతోపాటు కుమారుడు హర్ఫాన్‌అలీ ఉన్నారు. రెండో సంతానమైన హర్ఫాన్‌అలీ 2012 ఫిబ్రవరి 29న జన్మించాడు. ప్రస్తుతం 12 ఏళ్ల వయస్సు ఉన్న హర్ఫాన్ అలీ తన జన్మదిన వేడుకలను మాత్రం కేవలం రెండుసార్లే జరుపుకున్నాడు. గురువారం మూడోసారి జరుపుకోవాల్సి ఉంది. నాలుగేళ్లకు ఒకసారి వచ్చే కుమారుడి పుట్టినరోజు వేడుకలను తల్లిదండ్రులు ఘనంగా నిర్వహిస్తారు. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో నాలుగు సంవత్సరాలకు ఒకసారి పుట్టినరోజు వేడుక జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది అంటున్నాడు హర్ఫాన్ అలీ.

నాలుగేళ్లకో పండుగ

సాధారణంగా ప్రతి సంవత్సరంలో ఉండేది 365 రోజులు. కానీ నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీప్ సంవత్సరంలో మాత్రం 366 రోజులు ఉంటాయి. ఆ ఏడాదిలోని ఫిబ్రవరి నెలలో 29 రోజులు ఉంటాయి. నాలుగేళ్లకోసారి వచ్చే ఈ రోజును ప్రజలు ప్రత్యేకంగానే భావిస్తారు. జీవితకాలం గుర్తుండాలన్న లక్ష్యంతో ఆ రోజున కొంతమంది వివాహాలు చేసుకుంటారు. మరికొంత మంది తమ పిల్లల పుట్టిన రోజులు ఆ రోజునే వచ్చే విధంగా ముందస్తుగా ప్లాన్ వేసుకుంటారు. అలా ఈ వేడుకలు చేసుకునే ప్రతి ఒక్కరికీ ఈ రోజు సమ్‌థింగ్ స్పెషల్‌గానే చెప్పుకోవచ్చు.

- మళ్లీ మళ్లీ రాని రోజు
- నేడు పలువురి బర్త్ డే, మ్యారేజ్ డేలు
- పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైన జంటలు



20 ఏళ్లకు ఐదవ పెళ్లిరోజు..



గోపికృష్ణ, గీత దంపతులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లికి చెందిన చెందిన గుమ్మడవెల్లి గోపికృష్ణ, చండూరు పట్టణానికి చెందిన గీతను ఫిబ్రవరి 29, 2004లో వివాహం చేసుకున్నాడు. వీరి వివాహమైన 20 సంవత్సరాలు అవుతోంది. సాయి వర్షిత్, లక్ష్మివర్షి సంతానం. ప్రస్తుతం వీరు ఐదవ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. తమ పెళ్లి కుదిరినప్పుడు వారి పేర్ల మీదుగా ఫిబ్రవరి 29న మూహూర్తం నిర్ణయించగా.. నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే లీపు సంవత్సరం కావడం ఆనందంగా అంగీకరించి పెళ్లి చేసుకున్నామని చెబుతున్నారు గోపికృష్ణ, గీత దంపతులు. ఒక ప్రత్యేకమైన రోజున తమ వివాహ వార్షికోత్సవ వేడుక జరుపుకోవడం కొత్త అనుభూతిని ఇస్తుందని వారు పేర్కొంటున్నారు.

మంచి ముహూర్తమని..

కోదాడ : ఫిబ్రవరి 29న వివాహం చేసుకొనే జంటలు మళ్లీ పెళ్లిరోజు చేసుకోవడం నాలుగు సంవత్సరాల తరువాతే వీలవుతుంది. అయినప్పటికీ మంచి ముహూర్తమని పలు జంటలు గురువారం వివాహాలు చేసుకుంటున్నాయి. గురువారం కోదాడకు చెందిన కందికొండ జయమ్మ- వీరబాబు కుమార్తె ఉమాత్రివేద వివాహం చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెంకు చెందిన రాజేష్‌తో జరగనుంది. అదే విధంగా చిలుకూరుకు చెందిన దొడ్డా అజయ్‌చౌదరి వివాహం ఖమ్మంకు చెందిన ప్రత్యూషతో జరగనుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల వరకు వివాహ వార్షికోత్సవం జరుపుకోలేకపోతున్నా మంచి ముహూర్తమని వివాహం చేసుకుంటున్నాని, అందరిలా కాకుండా తమది సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుందని ఆనందంగా చెబుతున్నారు.



రాజేష్- ఉమాత్రివేద



అజయ్- ప్రత్యూషతో తల్లిదండ్రులు

ఎనిమిదేళ్లకు రెండో పుట్టినరోజు



తల్లిదండ్రులు, ఇద్దరు అక్కలతో తన్విక్ గౌతమ్

నిడమనూరు నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చందిన దోరేపల్లి నాగరాజు–మాధవి దంపతులకు ముగ్గురు సంతానం. వీరికి మూడో సంతానంగా తన్విక్ గౌతమ్ 2016 ఫిబ్రవరి 29న లీపు సంవత్సరం జన్మించాడు. పుట్టిన నాలుగు సంవత్సరాలకు 2020 ఫిబ్రవరి 29న మొదటి పుట్టినరోజు జరుపుకోగా.. తిరిగి గురువారం పుట్టిన రోజు వేడుక జరుపుకుంటున్నారు. అయితే తన అక్కలిద్దరూ ప్రతి సంవత్సరం పుట్టిన రోజు వేడుకు జరుపుకుంటుంటే మొదట తనకు కొంత బాధ అనిపించినా.. నాలుగు సంవత్సరాలకోసారి పుట్టిన రోజు జరుపుకోవడం కూడా ఒక ప్రత్యేకత అనిపిస్తోందని అంటున్నాడు తన్విక్ గౌతమ్.

ఆలయంలో కేక్ కటింగ్ నా సెంటిమెంట్



బద్దం రంగవల్లి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బద్దం యాదగిరి–యాదమ్మ ఏకైక కుమార్తె బద్దం రంగవల్లి 2000 ఫిబ్రవరి 29న జన్మించింది. దీంతో ఆమె ప్రతి నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు వేడుక జరుపుకుంటోంది. ఎమ్మెస్సీ పూర్తిచేసిన రంగవల్లి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. లీప్ సంవత్సరం రోజు జన్మించడంతో నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు జరుపుకుంటానని చెబుతోంది రంగవల్లి. ఆలయానికి వెళ్లి పూజలు చేసి కేక్ కట్‌చేసి లీప్ సంవత్సరం రోజున తన శక్తి మేర పేదలకు సాయమందిస్తానని పేర్కొంటోంది.

మధుర జ్ఞాపకం



కొండానాయక్ - పార్వతి

మఠంపల్లి : మండలంలోని గుర్రంబోడు తండాకు చెందిన ముడావత్ పార్వతి ప్రస్తుతం ఎంపీపీ. ఆమె భర్త కొండా నాయక్ మాజీ ఎంపీపీ. వీరి వివాహం 2004 ఫిబ్రవరి 29వ తేదీన లీపు సంవత్సరంలో జరిగింది. కొండానాయక్‌ది మఠంపల్లి మండలం గుర్రంబోడు తండా కాగా, పార్వతిది హాలియా మండలం నాయుడు పాలెం గ్రామం. వీరిది పెద్దలు కుదిర్చిన వివాహం. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొండానాయక్ 2006లో ఎంపీపీ కాగా, పార్వతి 2019 నుంచి ఎంపీపీగా కొనసాగుతున్నారు. పార్వతి బీఏ బీఈడీ పూర్తి చేయగా.. కొండానాయక్ కూడా గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఫిబ్రవరి 29వ తేదీ తన పెళ్లి రోజును నాలుగేళ్లకోసారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకోవడం మధుర జ్ఞాపకంగా ఉంటుందని ఈ దంపతులు పేర్కొంటున్నారు.

పెళ్లి రోజున ప్రత్యేక వేడుకలు



పిల్లలతో వీరాసింగ్, మాధవి దంపతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తిరుమలగిరి(సాగర్) మండలం జువ్విచెట్టు తండాకు చెందిన సఫావత్ వీరాసింగ్, మాధవి దంపతుల వివాహ వేడుక నాలుగు సంవత్సరాలకు ఒక సారి వస్తుంది. 2004 ఫిబ్రవరి 29న వీరి వివాహం జరిగింది. వీరికి వివాహమై ఇరవై సంవత్సరాలు అవుతున్నా.. నేడు ఐదో వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్నారు. అందరికీ ప్రతి సంవత్సరం వార్షికోత్సవం వస్తుందని.. కానీ మాకు నాలుగు సంవత్సరాలకు ఒకసారి వస్తుండడం మా జీవితంలో చాలా ప్రత్యేకమని వీరాసింగ్, మాధవి దంపతులు పేర్కొంటున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు మా వివాహ వార్షికోత్సవ వేడుకను ప్రత్యేకంగా నిర్వహిస్తారని చెబుతున్నారు.

గాయపడిన యువకుడు మృతి

తుంగతుర్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. నూతనకల్ మండలం చిన్ననెమిల గ్రామానికి చెందిన అనంతుల నాగరాజు (28) మంగళవారం స్నేహితుడు మహేష్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. తుంగతుర్తి మండలం వెలుగుపల్లి శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన నాగరాజు, మహేష్‌లను సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నాగరాజు బుధవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

కమ్యూనిస్టులకు ప్రజల అండ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

సంస్థాన్ నారాయణపురం: సమస్యలపై పోరాటం చేసే కమ్యూనిస్టులకు ప్రజలు అండగా ఉంటారని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ నాయకుడు కె.లింగయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని కోతులాపురం గ్రామంలో బుధవారం ఆయన విగ్రహం, స్థూపాన్ని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యున్నతికి, పేదల, రైతుల, కార్మికుల పక్షాన లింగయ్య చేసిన పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పార్టీ యాద్రాది, నల్లగొడ జిల్లాల కార్యదర్శులు గోదా శ్రీరాములు, నెల్లికంటి సత్యం, ఉజ్జిని రత్నాకర్‌రావు, కురిమిద్ద శ్రీనివాస్, బచ్చనగోని గాలయ్య పాల్గొన్నారు.



కోతులాపురంలో లింగయ్య స్థూపాన్ని అవిష్కరిస్తున్న సాంబశివరావు, వెంకట్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంపై మంత్రి ఉత్తమ్ దిగ్భ్రాంతి

- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ

సూర్యాపేట : మోతె మండలంలో బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఘటనలో గాయపడి వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అదే విధంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మునగాల ఎంపీపీ ఎలక బిందు, జెడ్పీటీసీ ప్రమీల తదితరులు కూడా మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

మోతె మండలంలో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలను సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డేలు పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

పొట్టకూటికి వెళ్తూ.. మృత్యుఒడికి

మోతె శివారులో కూలీల ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఐదుగురు కూలీలు దుర్మరణం.. పలువురికి గాయాలు
- మృతులంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే..



ప్రమాద స్థలంలో మృతదేహాలు, ఆటో, ఆర్టీసీ బస్సు



సూర్యాపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

మునగాల, మోతె: రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు వారివి. కూలికి వెళితేనే వారి జీవనం గడుస్తుంది. పొట్టకూటి కోసం కూలికి వెళుతుండగా మార్గమధ్యలో ఆర్టీసీ బస్సు రూపంలో వారిని మృత్యువు కబళించింది. మునగాల మండలం విజయరాఘవపురం గ్రామానికి చెందిన పదిమంది మహిళా కూలీలు, రేపాల గ్రామానికి చెందిన మరో ఇద్దరు కూలి కోసం మోతె మండలం హుస్సేనబాద్ గ్రామంలో మిర్చితోటలో కాయలు ఏరేందుకు కొన్ని రోజులుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో బుధవారం గ్రామానికి చెందిన ఓ ఆటోలో 11మంది మహిళలు, ఓ పురుషుడు కూలి పనుల కోసం మోతె మండలానికి బయలుదేరారు. మార్గమధ్యలో సూర్యాపేట -ఖమ్మం 365జాతీయ రహదారిపై మోతె శివారులో గల తిరుపతమ్మ తల్లి దేవాలయం సమీపంలోని అండర్‌పాస్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న ఆటోను హైదరాబాద్ వైపు వెళ్తున్న ఖమ్మం జిల్లా మధిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఆటో ఎగిరి 50అడుగుల దూరంలో పడిపోయింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు చిందరవందరగా పడిపోయారు. ఈ ప్రమాదంలో మునగాల మండలం విజయరాఘవపురం గ్రామానికి చెందిన కందుల నాగమ్మ (65), చెవుల నారాయణమ్మ(56), ఇదే మండలం రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూర్యమ్మ(65)అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన విజయరాఘవపురం గ్రామానికి చెందిన రెమిడాల సౌభాగ్యమ్మ(75), కందుల గుర్వయ్య (65) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రమాదంలో ఆటోడ్రైవర్ సొంపంగు పవన్, కత్తి విజయమ్మ, సొంపంగి లక్ష్మి, పాలపాటి రాములమ్మ, సొంపంగి అనసూర్య, పాలపాటి మంగమ్మ, నారగాని రామచంద్రమ్మకు గాయాలయ్యాయి. వారిని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్‌ఐ యాదవేందర్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కోదాడ డీఎస్పీ

సూర్యాపేట–ఖమ్మం రహదారిపై మోతె మండల కేంద్రం శివారులో జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని బుధవారం కోదాడ డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

విజయరాఘవపురం, రేపాలలో విషాదం

మునగాల మండలంలోని విజయరాఘవపురం, రేపాల గ్రామాలకు చెందిన కూలీలు మోతె మండల కేంద్రం శివారులో జరిగిన ప్రమాదంలో మృతిచెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కూలి కోసం ఇతర గ్రామాలకు వలస వెళ్లే కూలీలు ప్రమాదంలో మృతిచెండడంతో గ్రామాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. నిత్యం గ్రామం నుంచి సుమారు వందమంది కూలీలు జీవనోపాధి నిమిత్తం మోతె మండలంలోని పలు గ్రామాలకు పత్తి, మిర్చి ఏరేందుకు కూలికి వెళుతుంటారు. కూలీల మృతితో ఆయా కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణం

జీవనోపాధి నిమిత్తం నిత్యం ఇతర గ్రామాలకు వెళ్లే వ్యవసాయ కూలీలు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం అనవాయితీగా మారింది. ఒక్కో ఆటోలో సుమారు 20మంది ప్రయాణిస్తుంటారు. ఆటో చార్జీలను కూలికి తీసుకువెళ్లే యజమానే భరిస్తాడు. తరచూ ఆటోలు ప్రమాదానికి గురవుతున్నప్పటికీ కూలీల తీరులో మార్పు రావడం లేదు.



సూర్యాపేట ఏరియా ఆస్పత్రి మార్చురీలో కూలీల మృతదేహాలు



సూర్యాపేట ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

రెండేళ్ల క్రితం భర్త, నేడు భార్య

సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మునగాల మండలంలోని రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూర్యమ్మ (65) సంఘటన స్థలంలోనే మృతిచెందింది. రెండేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. అనసూర్యమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా వారికి వివాహాలు చేసి ఒంటరిగా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది.

కూలి పనులు చేసుకుంటూ..

మునగాల మండలం విజయరాఘవపురం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ (60) ఇప్పటి వరకు వివాహం చేసుకోలేదు. తన చెల్లెలి కూతురును దత్తత తీసుకొని పెంచి, పోషించి వివాహం చేసింది. కూలి పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది.

దంపతులిద్దరూ..

మునగాల విజయరాఘవపురం గ్రామానికి చెందిన కందుల నాగమ్మ(60), తన భర్త గుర్వయ్య (65)తో కలిసి బుధవారం ఆటోలో కూలి పనుల నిమిత్తం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. అందరి వివాహాలు చేసి కుమారుడి వద్దే ఉంటూ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రమాదంలో దంపతులు ఇద్దరూ మృతిచెందంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తల్లి మరణంతో..

విజయరాఘవపురం గ్రామానికి చెందిన సౌభాగ్యమ్మకు ముగ్గురు కుమార్తెలు. అందరికీ వివాహాలు చేసి అత్తవారింటికి పంపి తన భర్తతో నిత్యం కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తుంది. కుటుంబానికి ఆసరాగా ఉన్న మాతృమూర్తి అర్ధంతరంగా మృతిచెందడంతో కుమార్తెలు తల్లడిల్లిపోతున్నారు.